COMMUNIST PARTY OF INDIA (MARXIST)

ANDHRA PRADESH COMMITTEE

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ప్రసారార్థం : విజయవాడ,

తేది : 24 సెప్టెంబరు, 2022.

## విశాఖ పోర్టు హార్బరు వద్ద మత్స్యకారులపై సిఐఎస్ఎఫ్ దౌర్జన్యంపై ఖండన

ఈ రోజు విశాఖ హార్బర్ వద్ద భూములు కోల్పోయిన 542 కుటుంబాల నిర్వాసితులు విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడగడానికి వెళ్ళిన వారిపై పోర్టు సిఐఎస్ఎఫ్ లాఠీచార్జ్ చేసి దౌర్జన్యానికి పాల్పడ్డారు. అనేక మందిని ఈడ్చివేశారు. సిఐఎస్ఎఫ్ దౌర్జన్యాన్ని సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. మత్స్యకారుల పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలియజేశారు.

2002లో విశాఖ పోర్టు వద్ద కంటైనర్ టెర్మినల్ ఏర్పాటు చేయడానికి 542 కుటుంబాలను పోర్టు యాజమాన్యం బలవంతంగా ఖాళీ చేయించి విశాఖ కంటైనర్ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యానికి అప్పగించింది. తప్పనిసరి పరిస్థితుల్లో మత్స్యకారులు తమ ఇళ్లను ఖాళీ చేసి బయటకు వచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని విశాఖపోర్టు యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం, కంటైనర్ టెర్మినల్ యాజమాన్యం మత్స్యకారులతో ఒప్పందం చేశారు. ఈ ఒప్పందం ప్రకారం 542 కుటుంబాలకు ప్రతి కుటుంబానికి లక్ష రూపాయలు పరిహారం, ప్రతి కుటుంబానికి ఒక ఉద్యోగం, 60 గజాల స్థలం, ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం చేస్తామని అంగీకరించారు. కానీ 20 సంవత్సరాలైనా నేటికీ ఒప్పందం అమలు చేయలేదు. కేవలం ప్రతి కుటుంబానికి రూ.25 వేలు చొప్పున నష్ట పరిహారం చెల్లించారు. ఒప్పందాన్ని అమలు చేయాలని మత్స్యకారులంతా తాము ఖాళీ చేసిన స్థలం వద్దకు అధికారులతో మాట్లాడటానికి వెళ్ళగా వారిపై దౌర్జన్యం చేయడం దుర్మార్గం. మత్స్యకారులతో జరిగిన ఒప్పందాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాము. మత్స్యకారుల ఉద్యమాన్ని పూర్తిగా బలపరుస్తున్నాము.

బిజెపి కేంద్ర ప్రభుత్వం సముద్రతీరాన్ని, భారీ పరిశ్రమలను కార్పొరేట్లకు కట్టబెడుతున్నది. మత్స్యకారులకు సముద్రతీరం తప్ప జీవనోపాధికి మరో మార్గం లేదు. అటువంటి వారిని ఏ ఆధారం లేకుండా రోడ్డుపై పడేయటం అన్యాయం. సముద్రతీరంలో రసాయన పరిశ్రమల ఏర్పాటు కోసం రాష్ట్రంలో అనేక చోట్ల మత్స్యకారులను బలవంతంగా బయటకు నెడుతున్నారు. ఇటువంటి ప్రయత్నాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విరమించుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని మత్స్యకారుల ఒప్పందం తక్షణం అమలు జరిగేటట్లు చర్యలు తీసుకోవాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది.

J. Jayaram

**(జె.జయరాం)**
ఆఫీసు కార్యదర్శి